కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక - 51 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 24-02-2026 మంగళవారం పేజీలు : 6

# కల్తీపాల మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం

## శాసనసభలో ప్రటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నివేదిక రాగానే బాధ్యుడిపై కఠిన చర్యలు తీసుకుంటామన్న ముఖ్యమంత్రి



అమరావతి, ఫిబ్రవరి 23 (బిఎన్ఎస్): రాజ మహేంద్రవరం లోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో కల్తీపాల వినియోగంతో మృత్యువాత పడిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ. 10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. రాజ మహేంద్రవరంలో జరిగిన ఈ ఘటనపై శాసన సభలో మాట్లాడిన సీఎం...బాధిత కుటుంబాలకు పరిహారాన్ని ప్రకటించారు. ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరిస్తుందని తెలిపారు. మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

2 లో

# రెండు తెలుగు రాష్ట్రాల్లో మొదలైన ఇంటర్ పరీక్షల కోలాహలం

- నేటి నుంచే ఇంటర్ 'మహా' పరీక్షలు..ద రెండు రాష్ట్రాల్లోనూ సర్వం సిద్ధం!
- ఏపీలో నేటి నుంచి, తెలంగాణలో 25 నుంచి ప్రారంభం.. 'నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ'



అమరావతి/హైదరాబాద్, ఫిబ్రవరి 23 (బిఎన్ఎస్): తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు రంగం సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్‌లో నేటి (సోమవారం) నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రారంభం కాగా, రేపటి (ఫిబ్రవరి 24) నుంచి ద్వితీయ సంవత్సర పరీక్షలు జరగనున్నాయి. తెలంగాణలో ఫిబ్రవరి 25 (బుధవారం) నుంచి ఫస్ట్ ఇయర్, 26 నుంచి సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. రెండు రాష్ట్రాల్లో కలిపి సుమారు 19 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారు.

2 లో

# కోఠిలో 'ఆశా' గర్జన

- ఆరోగ్య శాఖ కమిషనరేట్ ముట్టడి!
- రూ. 18 వేల వేతనం కోసం రోడ్డెక్కిన కార్యకర్తలు
- పోలీసుల తోపులాట, అరెస్టులతో ఉద్రిక్తత



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (బిఎన్ఎస్): తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశా వర్కర్లు సోమవారం రాజధానిలో సమరశంఖం పూరించారు. "చలో హైదరాబాద్" పిలుపులో భాగంగా వేలాదిమంది ఆశా కార్యకర్తలు కోఠిలోని ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రూ. 18,000 స్థిర వేతనం చెల్లించాలని, పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆశా వర్కర్లకు మధ్య జరిగిన తోపులాటతో కోఠి ప్రాంతం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది.

2 లో

# రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే దేశంలో రుగ్మతలకు పరిష్కారం

## దేశంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేయాలని బిజెపి ప్రయత్నం చేస్తుంది

### ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (బిఎన్ఎస్): రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే ఈ దేశంలోనే రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని, ఆయనను ప్రధానమంత్రిగా చేసే వరకు రెండు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిరంతరం పనిచేయాలి రెండు రాష్ట్రాల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఆయన వికారాబాద్ లో నిర్వహిస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో మాట్లాడారు. "కుల సమస్యలు, రిజర్వేషన్లు, కాంగ్రెస్ వాదిగా కుల వివక్ష నిర్మూలనకు ఎలా పోరాటం చేయాలి" అన్న అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు.



దేశంలో అంటరానితనం, వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం అవుతారు అని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల కుల వివక్షను భరించలేక బలవన్మరణానికి పాల్పడితే రాహుల్ గాంధీ నేరుగా యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులతో చర్చించి పోరాట విధానాన్ని ఖరారు చేశారని తెలిపారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను ఎవరిని కూడా యూనివర్సిటీలోకి రానివ్వలేదు అంటరానితనం సమస్యను సమస్యగా చూడాలి తప్ప రాజకీయ జోక్యం ఉండకూడదు అన్నది ఆయన ఆలోచన అని వివరించారు.

2 లో

# తిరుమల 'లడ్డూ' అపవిత్రతపై నేడు అసెంబ్లీలో మహా సంగ్రామం!



శాసనసభలో పూర్తిస్థాయి చర్చకు ప్రభుత్వం నిర్ణయం.. దోషులెవరో తేల్చేందుకు సిద్ధం

అమరావతి, ఫిబ్రవరి 23 (బిఎన్ఎస్): కోట్లాదిమంది హిందువుల ఆరాధ్య దైవం, తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం అంశంపై ఆంధ్రప్రదేశ్ శాసనసభ నేడు (మంగళవారం) హోరెత్తనుంది

2 లో

# వైసీపీ ఖాళీ అవ్వడం ఖాయం..జగన్ ఇక ఒంటరే!

## అసెంబ్లీ లాబీల్లో మంత్రి నారా లోకేష్ సంచలన వ్యాఖ్యలు



అమరావతి, ఫిబ్రవరి 23 (బిఎన్ఎస్):అసెంబ్లీ లాబీల్లో మంత్రి నారా లోకేష్ సంచలన వ్యాఖ్యలు అమరావతి: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం అసెంబ్లీ లాబీల్లో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. విలేకరులతో సరదాగా చిట్‌చాట్ చేసిన విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ప్రధాన ప్రతిపక్షం వైసీపీపై నిప్పులు చెరిగారు. రాబోయే రోజుల్లో ఆ పార్టీ ఉనికే ప్రశ్నార్థకం కాబోతుందని ఆయన విమర్శ నాస్త్రాలు సంధించారు.

2 లో

# పులివెందులలో వైఎస్ జగన్ పర్యటన

- రెండు రోజుల పాటు నియోజకవర్గంలోనే
- బస.. 'ప్రజా దర్బార్' ద్వారా సమస్యల స్వీకరణ



తాడేపల్లి/పులివెందుల, ఫిబ్రవరి 23 (బిఎన్ఎస్): వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం (ఫిబ్రవరి 24) నుంచి రెండు రోజుల పాటు కడప జిల్లా పులివెందుల నియోజక వర్గంలో పర్యటించనున్నారు. అసెంబ్లీ సమావేశాల వేళ ప్రభుత్వంపై పోరాటంతో పాటు, తన సొంత నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఆయన ఈ పర్యటనను ఖరారు చేశారు

2 లో

# సునీల్ కుమార్ కుచ్చు బిగించనున్న సునీల్ నాయక్

## రఘురామా టార్చర్ కేసులో కొత్త ట్విస్ట్

- సునీల్ నాయక్ బీహార్లో అరెస్ట్!
- సునీల్ కుమార్ సస్పెన్షన్ పొడిగింపు! టీ



రఘురామకృష్ణరాజు (RRR) కస్టోడియల్ టార్చర్ కేసు ఇప్పుడు క్లైమాక్స్ దశకు చేరుకుంది. అప్పట్లో అధికార గర్వంతో జగన్ కళ్లలో ఆనందాన్ని చూడడానికి చట్టాన్ని చుట్టచుట్టిన ఐపీఎస్ అధికారుల చుట్టూ ఇప్పుడు న్యాయస్థానం, పోలీస్ విచారణ ఉచ్చు బిగుస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న పి.వి. సునీల్ కుమార్ మరియు సునీల్ నాయక్ అనే ఇద్దరు అధికారుల విషయంలో గత 24 గంటల్లో చోటుచేసుకున్న పరిణామాలు ఈ క్రైమ్ క్లైమాక్స్ దిశగా సాగుతోందని స్పష్టం చేస్తున్నాయి.

# ఎవరిని కలసిన ఎర్రన్న పేరే ముందు

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

- శ్రీకాకుళంలో వాడ,వాడలా ఎర్రన్న 69వ జయంతి.
- జోహార్ ఎర్రన్న అంటూ నినదించిన సిక్కోలు.
- ఎర్రన్న ఆశయ సాధనకు కృషి చేస్తున్నా
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.
- సాగునీరు, ఉపాధి జిల్లాకు చేరువ చెయ్యడమే ఎర్రన్న ఆశయం.
- ఆ దిశగా విశేష కృషి, త్వరలో ఫలాలు.



శ్రీకాకుళం, ఫిబ్రవరి 23 (బిఎన్ఎస్): గల్లీ నుండి ఢిల్లీ వరకు దివంగత కేంద్ర మాజీమంత్రి ఎర్రన్న స్థానం ఎప్పుడూ ప్రత్యేకమైనది అని ఆయన తనయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు

2 లో

# మున్సిపల్ గెలుపు జోష్‌లో కేబినెట్ భేటీ..

## బడ్జెట్, రైతు భరోసాపైనే నజర్!

ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి సమావేశమైన మంత్రిమండలి.. కీలక నిర్ణయాలకు సిద్ధం



హైదరాబాద్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా ముగిసి, కూటమి (కాంగ్రెస్) ఘనవిజయం సాధించిన నేపథ్యంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సచివాలయంలో భేటీ అయ్యింది. ఎన్నికల ఫలితాల తర్వాత జరుగుతున్న తొలి సమావేశం కావడంతో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

3 లో

# కల్తీపాల మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం

మొదటి పేజీ తరువాయి

**కల్తీపాల ఘటన చాలా బాధాకరం**

శాసన సభలో రాజమహేంద్రవరం ఘటనపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...'రాజమహేంద్రవరం ఘటనలోని బాధితులు వాంతులు, కడుపునొప్పి, డయాలసిస్ సమస్యతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్లీనికల్ పరీక్షల్లో రక్తంలో యూరియా, సీరమ్ క్రియాటినిన్ స్థాయి పెరిగినట్లు వైద్యులు గుర్తించారు. కోరుకొండ మండలం, నరసాపురం గ్రామంలో వరలక్ష్మీ మిల్క్ డెయిరీ 106 కుటుంబాలకు రోజూ పాల సరఫరా చేస్తోంది. ఈ డెయిరీ నుంచి వచ్చిన పాలను తాగి అనారోగ్యం పాలయ్యారని అధికారులు నిర్ధారించారు. ఈ ఘటనలో నలుగురు చనిపోయారు. ఇద్దరు వెంటిలేటర్‌పై ఉన్నారు. మరో 8 మంది చికిత్స పొందుతున్నారు. మృతుల్లో ముగ్గురు 70 ఏళ్లకు పైబడిన వారు, ఒకరు 58 ఏళ్ల వయసు వారు ఉన్నారు. బాధితుల నుంచి నమూనాలను తీసుకుని హైదరాబాద్, విశాఖపట్నం ల్యాబ్స్‌కు పరీక్షల కోసం పంపించాం. డెయిరీ నిర్వాహకుడు అద్దాల గణేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. కాసులకు కక్కుర్తి పడి ఈ కల్తీ వ్యవహారానికి పాల్పడితే సీరియస్‌గా తీసుకుంటాం. విచారణ అనంతరం దోషులపై చర్యలు తీసకుంటాం. రాష్ట్రంలో ఎవరైనా కల్తీకి పాల్పడినా, ప్రజలకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించినా ప్రభుత్వం ఉదాసీనంగా ఉండదు...అత్యంత కఠినంగా వ్యవహరిస్తాం' అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

**అసెంబ్లీలోని ఛాంబర్‌లో సమీక్ష**

రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్ ప్రాంతాల్లో పాల వినియోగంతో స్థానికులు అస్వస్థతకు గురవడం, పలువురు మరణించారన్న ఘటన తెలియగానే ఉదయమే ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైద్యారోగ్య శాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులతో సమీక్షించి ఘటనకు గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందుతున్న వైద్యసాయంపై ఆరా తీశారు. చికిత్స పొందుతున్న వారికి అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. పాలు వినియోగించిన కుటుంబాల్లోని 75 మంది నుంచి శాంపిల్స్ సేకరించామని, మిగిలిన వారందరి నుంచి కూడా నమూనాలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఫుడ్ సేఫ్టీ, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తక్షణమే రాజమహేంద్రవరం వెళ్లి పరిస్థితిని పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ఈ ఘటనపై మరోసారి అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మంత్రులు, అధికారులతో మధ్యాహ్నం సీఎం చంద్రబాబు సమీక్షించారు.

# రెండు తెలుగు రాష్ట్రాల్లో మొదలైన ఇంటర్ పరీక్షల కోలాహలం

మొదటి పేజీ తరువాయి

**నిబంధనలు అతి కఠినం:** పరీక్షల నిర్వహణలో ఇంటర్ బోర్డులు అత్యంత కఠినమైన నిబంధనలను అమలు చేస్తున్నాయి.

**ఒక్క నిమిషం నిబంధన:** ఉదయం 9 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా కేంద్రంలోకి అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులు కనీసం 30-45 నిమిషాల ముందే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

**సిసి కెమెరాల నిఘా:** ప్రతి పరీక్షా కేంద్రంలోనూ సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని నేరుగా కంట్రోల్ రూమ్‌లకు అనుసంధానించి లైవ్ మానిటరింగ్ చేస్తున్నారు.

**మొబైల్స్ నిషిద్ధం:** పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, క్యాలిక్యులేటర్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను ఏమాత్రం అనుమతించరు.

**ఫ్లయింగ్ స్క్వాడ్లు:** కాపీయింగ్, మాల్‌ప్రాక్టీస్ అరికట్టేందుకు ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్లను, సిట్టింగ్ స్క్వాడ్లను రంగంలోకి దించారు.

**అధికారుల ఏర్పాట్లు:**

పరీక్షల సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. హాల్ టికెట్లు ఇప్పటికే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి, కళాశాల ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా హాల్ టికెట్‌తో అనుమతించాలని ఏపీ బోర్డు ఆదేశించింది.

**విద్యార్థులకు సూచన:** ప్రశాంత చిత్తంతో పరీక్షలు రాయాలని, ఒత్తిడికి లోనుకావద్దని ఇరు రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులు సందేశమిచ్చారు.

# కోఠిలో 'ఆశా' గర్జన

మొదటి పేజీ తరువాయి

ప్రధాన డిమాండ్లు ఇవే:

**వేతన పెంపు:** ప్రస్తుత గౌరవ వేతనాన్ని రూ. 18,000లకు పెంచి, ప్రతినెలా 1వ తేదీనే చెల్లించాలి.

**సామాజిక భద్రత:** ఆశా వర్కర్లకు ఈఎస్ఐ (ESI), పీఎఫ్ (PF) సౌకర్యాలు కల్పించాలి.

**బీమా సదుపాయం:** విధి నిర్వహణలో ప్రమాదం జరిగితే రూ. 50 లక్షల బీమా ధీమా కల్పించాలి.

**పని భారం:** అశాస్త్రీయమైన పని గంటలను తగ్గించి, అదనపు పని భారం నుంచి విముక్తి కల్పించాలి.

**రిటైర్మెంట్ బెనిఫిట్స్:** పదవీ విరమణ చేసిన వారికి రూ. 5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించాలి.

**యుద్ధ ప్రాతిపదికన అరెస్టులు:**

ముందస్తు సమాచారంతో పోలీసులు కమిషనరేట్ వద్ద భారీగా మోహరించారు. కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆశా వర్కర్లను పోలీసులు అడ్డుకున్నారు. నిరసనకారులను బలవంతంగా ఈడ్చుకెళ్లి పోలీస్ వాహనాల్లోకి ఎక్కించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్ తరలివస్తున్న ఆశా వర్కర్లను పోలీసులు ఎక్కడికక్కడ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలోనే అదుపులోకి తీసుకున్నారు.

**ప్రభుత్వంపై మండిపాటు:**

"ప్రజారోగ్య వ్యవస్థలో మేము కీలక పాత్ర పోషిస్తున్నాం. గర్భిణీలు, చిన్నపిల్లల సంరక్షణలో రేయింబవళ్లు శ్రమిస్తున్నా.. మాకు కనీస వేతనం ఇవ్వడం లేదు. అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మమ్మల్ని పట్టించుకోవడం లేదు" అని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. జయలక్ష్మి మండిపడ్డారు.

# ఎవరిని కలసిన ఎర్రన్న పేరే ముందు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

మొదటి పేజీ తరువాయి

తన తండ్రి దివంగత ఎర్రంనాయుడు 69వ జయంతి సంధర్భంగా శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా జరిగిన పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. తొలుత తన స్వగృహంలో ఎర్రంనాయుడు చిత్రపటానికి అనంతరం, శ్రీకాకుళం నగరంలోని ఎనబై అడుగుల రహదారి, ఏడు రోడ్ల కూడలి, ప్రజా సదన్ కార్యాలయం, సింహద్వారం కూడలి, పెద్దపాడు కూడలి, నిమ్మాడ కూడలి లో ఎర్రంనాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన స్వగ్రామమైన నిమ్మాడ లోని ఎర్రన్న ఘాట్ లో కుటుంబ సభ్యులతో కలసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జోహార్ ఎర్రన్న నినాదాలతో శ్రీకాకుళం జిల్లా మారుమ్రోగింది. ఈ సందర్భంగా మీడియాతో రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. ఎర్రన్న జ్ఞాపకాలను తమ భుజాలపై మోస్తున్న ఆయన అభిమానులకు ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఎర్రన్న నాయకత్వం ఎప్పుడూ ఆదర్శప్రాయం అని.. ఆయన రాజకీయ ప్రవేశంతో ఎన్నో మార్పులు చూశామని అన్నారు. ఆయన జీవితం ఓ రాజకీయ పాఠం అని తెలిపారు. ఆయన వారసత్వం నేను తీసుకుని వస్తె..అశేషంగా అభిమానాన్ని చూపారని అన్నారు. ఎర్రన్న కోసం పెద్ద పెద్ద నాయకులు ఎప్పుడూ తలచుకుంటూ ఉండేవారని.. తాను ఇప్పుడు ఎవరిని కలిసినా ఆ జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ మొదటి ప్రాధాన్యత నా తండ్రికి ఇస్తూ ఉండటం గర్వంగా ఉందని అన్నారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి.. దేశ స్థాయి, అంతర్జాతీయ స్థాయిలో కీర్తి సాధించిన వ్యక్తి ఎర్రంనాయుడు అని అన్నారు. శ్రీకాకుళం జిల్లా రైతులకు సాగునీటినీ చేరువ చెయ్యడంలో విశేష కృషి చేశారని అన్నారు. నేరేడు బ్యారేజి పై విశేష కృషి చేశారని గుర్తు చేశారు. ఇదే అంశంపై ఆయన ఆశయాన్ని నేరవేర్చేందుకు తను కృషి చేస్తున్నానని.. ఇప్పటికే కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్ పాటిల్ తో కూడా భేటీ అయ్యానని, పరిస్థితి వివరించామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఆ దిశగా విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు. ఒరిస్సా ప్రభుత్వంతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని, టిబ్యునల్ కోర్టు తీర్పు అమలు కోసం కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశామని అన్నారు. ఖచ్చితంగా కూటమి హయాంలోనే నేరేడు బ్యారేజి ప్రారంభోత్సవం చేసి తీరుతామని స్పష్టం చేశారు. అదేవిధంగా జిల్లాకు పరిశ్రమలు తీసుకురావడం ద్వారా అభివృద్ధి, ఉపాధి చేరువ అవుతాయని ఎర్రంనాయుడు నమ్మేవారని.. ఆ ఆశయాలకు కొనసాగింపుగా నేడు అనేక పరిశ్రమలను జిల్లాకు తీసుకువస్తున్నామని అన్నారు. కేంద్ర బడ్జెట్ లో రేర్ ఎర్త్ కారిడార్ ప్రకటన ద్వారా మొదటి లబ్ధి పొందేది శ్రీకాకుళం జిల్లా అని.. ఆ ప్రాజెక్టులను శ్రీకాకుళం జిల్లాలో ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. పోర్ట్ పనులు కూడా ఫస్ట్ షిప్ బెర్త్ చేసి శరవేగంగా పనులు జరుపుతున్నామని తెలిపారు. ఎర్రంనాయుడు ఆశయాలు అయిన సాగునీరు, ఉపాధి కోసం తాము ముందుకు వెళు _న్నామని అన్నారు. గత అయిదేళ్ళు అస్తవ్యస్త పాలన నుండి.. నేడు రెడ్ కార్పెట్ తో గూగుల్ లాంటి సంస్థలు వచ్చి చేరాయని.. దానికి కారణం చంద్రబాబు నాయుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు, ఎర్రంనాయుడు అభిమానులు, స్థానికులు విశేషంగా పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే దేశంలో రుగ్మతలకు పరిష్కారం

మొదటి పేజీ తరువాయి

ఆయన ఆలోచన మేరకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో రోహిత్ వేముల చట్టం తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం రాగానే వనరులు సంపద సమానంగా పంచుతామని ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ప్రకటించారు ఆయన ప్రకటించినట్టుగా అధికారంలోకి రాగానే ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశ స్వాతంత్రం అనంతరం ఎక్కడా జరగని కుల గణనను ప్రజా ప్రభుత్వం 50 రోజుల్లో పూర్తి చేసి శాసనసభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందాలని వివరించారు.

దేశానికి స్వాతంత్రం సాధించడంతో పాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధించేందుకు అనేక విప్లవాత్మక చట్టాలు చేసిన కాంగ్రెస్ పార్టీని కను మరుగు చేసేందుకు బిజెపి కుట్రలు చేస్తుందని తెలిపారు. స్వాతంత్రం ముందు నుంచి దేశంలోని రుగ్మతల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న కాంగ్రెస్ పార్టీని దేశంలో లేకుండా చేసేందుకు బిజెపి కాంగ్రెస్ ముక్తభారత్ చేస్తాం, రాజ్యాంగాన్ని మారుస్తాం అంటుంది అన్నారు. ఈ సమాజం సామాజికంగా, ఆర్థికంగా విభజన జరిగి ఇలాగే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయని తెలిపారు. కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవం, తాను కుల వివక్షణ ఎదుర్కొన్నానని వివరించారు. ఈ సమాజంలో కుల వివక్ష ఉంటుంది అన్న వాస్తవాన్ని మదిలో పెట్టుకుని బలమైన సంకల్పంతో అనుకున్న లక్ష్య సాధనకు ముందుకు పోతున్న క్రమంలో వివక్ష ఎదురైన అది మన లక్ష్యాలను దెబ్బతీయలేదని వివరించారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఒక రాజకీయ పార్టీగా మాత్రమే కాదు దేశంలో అంటరానితనం, బాల్య వివాహం, వితంతు వివాహం వంటి అనేక రుగ్మతలపై దశాబ్దాలుగా ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు పోతుందని తెలిపారు. దేశ స్వాతంత్ర సంగ్రామం ఒకవైపు, సామాజిక అంశాలపై ఆందోళనలో మరోవైపు ఈ దేశంలో రెండు అంశాలను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లిందని వివరించారు. కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో అంటరానితనం పూర్తిగా నిర్మూలించాలని, దేవాలయాల్లో అందరికీ ప్రవేశం కల్పించాలని ౹ఖ మాధవన్ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేరళలో వైకాం సత్యాగ్రహ, మహారాష్ట్రలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో చౌదర్ సత్యాగ్రహం వంటి కార్యక్రమాలను అఖిలభారత కాంగ్రెస్ కమిటీ చేపట్టింది అన్నారు. గాంధీజీ ఆధ్వర్యంలో హరిజనోద్ధరణ పేరిట పెద్ద యాత్ర చేపట్టారని దళితుల దేవాలయల ప్రవేశం, దళిత వాడల్లో పారిశుద్ధ్యం వంటి కార్యక్రమాలు ఈ దేశంలో అంటరానితనాన్ని తొలగిస్తారని గాంధీ ఓ నమ్మకాన్ని ఏర్పరిచారని తెలిపారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రధాని నెహ్రూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో దేశంలో అంటరాని తనం నిర్మూలనకు 1049లో ఆర్టికల్ 17 ద్వారా అవకాశం కల్పించారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావడం, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను పూర్తిగా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే సాధ్యమైంది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయ కరణ ద్వారా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక స్వాతంత్రం లభించిందని తద్వారా సామాజిక వివక్షను ఎదుర్కొనేందుకు చేయూత లభించిందని డిప్యూటీ సీఎం వివరించారు. సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డాక్టర్ వంశీ చందర్ రెడ్డి, ఏ ఐ సి సి నాయకులు విశ్వనాథన్, సావంత్, సచిన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ఖాళీ అవ్వడం ఖాయం.. జగన్ ఇక ఒంటరే!

మొదటి పేజీ తరువాయి

**పార్టీ ఖాళీ అవ్వడం ఖాయం:** వైసీపీలో మిగిలి ఉన్న కొద్దిమంది ఎమ్మెల్యేలు కూడా త్వరలోనే బయటకు వచ్చేస్తారని, ఆ పార్టీ త్వరలోనే ఖాళీ అవుతుందని లోకేష్ జోస్యం చెప్పారు.

**జగన్ వైఖరిపై విమర్శలు:** అసెంబ్లీకి రాకుండా పారిపోవడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష హోదాను కూడా కాపాడుకోలేని స్థితిలో జగన్ ఉన్నారని ఎద్దేవా చేశారు.

**అభివృద్ధే మా మంత్రం:** గత ఐదేళ్ల విధ్వంసాన్ని చక్కదిద్దుతూ, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "మేము ప్రజల కోసం పనిచేస్తుంటే, వారు కేవలం తమ ఉనికి కోసం ఆరాటపడుతున్నారు" అని విమర్శించారు.

**తప్పు చేస్తే వదిలేది లేదు:** గత ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడిన వారు చట్టం నుండి తప్పించుకోలేరని, విచారణలు పారదర్శకంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

**లాబీల్లో సందడి:** లోకేష్ చిట్‌చాట్ సమయంలో లాబీల్లో ఉన్న ఇతర ఎమ్మెల్యేలు, మీడియా ప్రతినిధులతో ఆయన ఎంతో చురుగ్గా మాట్లాడారు. అడిగిన ప్రతి ప్రశ్నకు తనదైన శైలిలో కౌంటర్లు ఇస్తూ, రాజకీయ పరిణామాలపై స్పష్టతనిచ్చారు. ప్రస్తుతం లోకేష్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

# తిరుమల 'లడ్డూ' అపవిత్రతపై నేడు అసెంబ్లీలో మహా సంగ్రామం!

మొదటి పేజీ తరువాయి

ఈ సున్నితమైన మరియు అత్యంత కీలకమైన అంశంపై సభలో పూర్తిస్థాయి చర్చ చేపట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అపవిత్ర కార్యానికి బాధ్యులెవరు? అసలు తప్పు ఎక్కడ జరిగింది? అనే విషయాలను ఆధారాలతో సహా సభ ముందుంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

**చర్చాంశాలు ఇవే:** నెయ్యి సేకరణలో లోపాలు: గత ప్రభుత్వం హయాంలో నెయ్యి సరఫరా టెండర్లలో జరిగిన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై ప్రధానంగా చర్చ జరగనుంది.

**ల్యాబ్ రిపోర్టుల విశ్లేషణ:** గుజరాత్‌లోని ఎన్.డి.డి.బి (చీణణదీ) ల్యాబ్ ఇచ్చిన నివేదికలో వెల్లడైన దిగ్భ్రాంతికర వాస్తవాలను ప్రభుత్వం అధికారికంగా సభలో ప్రవేశపెట్టనుంది.

**టీటీడీ పాలకమండలి పాత్ర:** అప్పట్లో తిరుమల తిరుపతి దేవస్థానం (ఞఞ) నిర్ణయాలు తీసుకున్న తీరు, అధికారుల పర్యవేక్షణ లోపంపై కూటమి ఎమ్మెల్యేలు విమర్శనాస్త్రాలు సంధించే అవకాశం ఉంది.

**ప్రక్షాళన దిశగా అడుగులు:** భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, 'సంప్రోక్షణ' ప్రక్రియ మరియు కొత్త నిబంధనలపై ముఖ్యమంత్రి ప్రకటన చేసే అవకాశం ఉంది.

**ఉత్కంఠ రేపుతున్న చర్చ:**

ఈ అంశంపై ప్రతిపక్ష వైసీపీ వైఖరి ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే ఈ వ్యవహారంపై సిట్ (ూ×ఱ) విచారణ మరియు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో కమిటీ విచారణ జరుగుతున్న నేపథ్యంలో, సభలో వెల్లడయ్యే కొత్త విషయాలు రాజకీయంగా పెను సంచలనం సృష్టించే అవకాశం ఉంది.

"గోవిందుడి ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదు. భక్తుల మనోభావాలతో ఆడుకున్న వారి అసలు రంగును అసెంబ్లీ వేదికగా బయటపెడతాం." – ప్రభుత్వ వర్గాలు

**ముఖ్య గమనిక:** మంగళవారం ఉదయం సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ అనుమతితో ఈ చర్చ ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా భక్తులు ఈ చర్చ కోసం ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

# పులివెందులలో వైఎస్ జగన్ పర్యటన

మొదటి పేజీ తరువాయి

పర్యటన షెడ్యూల్ ఇలా:

ఫిబ్రవరి 24 (మంగళవారం): మధ్యాహ్నం తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు పులివెందులకు చేరుకుంటారు. భాకరాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో 'ప్రజా దర్బార్' నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు, పార్టీ కార్యకర్తలతో నేరుగా భేటీ అయి వారి వినతులను స్వీకరిస్తారు. అనంతరం రాత్రికి పులివెందుల నివాసంలోనే బస చేస్తారు.

ఫిబ్రవరి 25 (బుధవారం): ఉదయం 9:30 గంటలకు వేంపల్లి మండలం నందిపల్లి గ్రామానికి చేరుకుంటారు. అక్కడ నూతనంగా నిర్మించిన నందీశ్వర ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

**మధ్యాహ్నం:** తిరిగి పులివెందుల చేరుకుని రెండో రోజూ ప్రజా దర్బార్‌లో పాల్గొంటారు. నియోజకవర్గ అభివృద్ధి పనులు, పార్టీ సంస్థాగత బలోపేతంపై స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహిస్తారు.

**రాజకీయ ప్రాధాన్యత:** రాష్ట్ర అసెంబ్లీలో తిరుమల లడ్డూ అంశంపై చర్చ జరగనున్న సమయంలో జగన్ తన నియోజకవర్గ పర్యటనకు వెళ్లడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. అటు అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం వైసీపీని టార్గెట్ చేస్తున్న తరుణంలో, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవ్వడం ద్వారా క్యాడర్‌లో ధైర్యాన్ని నింపాలని జగన్ భావిస్తున్నారు. ఈ పర్యటన కోసం స్థానిక వైసీపీ నేతలు భారీ ఏర్పాట్లు చేశారు.

**ముఖ్య గమనిక:** జగన్ పర్యటన నేపథ్యంలో పులివెందుల క్యాంప్ ఆఫీస్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.

# కొల్లూరు భూముల కథ

## దశాబ్దాల చరిత్ర... చట్టబద్ధ రిజిస్ట్రేషన్లు... న్యాయం కోసం ఎదురుచూపులు

హైదరాబాద్ పశ్చిమ అంచుల్లో అభివృద్ధి వేగంగా విస్తరిస్తున్న సమయంలో కొల్లూరు ప్రాంతం ప్రత్యేక ప్రాధాన్యతను సంపాదించింది. ఐటీ విస్తరణ, రహదారి సౌకర్యాలు, మౌలిక వసతుల పెరుగుదలతో ఈ ప్రాంతం రియల్ ఎస్టేట్ దృష్టిని ఆకర్షించింది. అయితే ఈ అభివృద్ధి వెనుక ఒక దీర్ఘకాల భూముల వివాదం కొనసాగుతున్నది.

### ప్రారంభ దశ --- ప్రణాళికాబద్ధ ప్లాట్ల రూపకల్పన

1980ల మధ్యకాలంలో కొల్లూరు గ్రామ పరిధిలోని కొన్ని భూములు లేఅవుట్లుగా అభివృద్ధి చేయబడ్డాయి. అప్పటి ప్రభుత్వ విధానాల ప్రకారం ప్లాట్లుగా విభజన జరిగి, రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా కొనుగోళ్లు పూర్తయ్యాయి.

ఆ సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు, మధ్యతరగతి కుటుంబాలు ఈ ప్లాట్లను పెట్టుబడిగా కొనుగోలు చేశారు. స్టాంప్ డ్యూటీలు చెల్లించి, అధికారిక పత్రాలు పొందారు. రికార్డుల ప్రకారం లావాదేవీలు బహిరంగంగానే జరిగాయి.

### తరువాతి లావాదేవీలు --- చట్టబద్ధ నమోదు

కాలక్రమేణా మొదటి యజమానుల నుంచి మరికొందరు వ్యక్తులు ప్లాట్లు కొనుగోలు చేశారు. ప్రతి దశలోనూ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదు జరగడంతో, కొత్త యజమానులకు కూడా పూర్తి పత్రాలు లభించాయి.

ప్రభుత్వమే నమోదు చేసిన ఆస్తులపై హక్కులు కల్పించబడినట్లు పత్రాలు సూచిస్తున్నాయి. దీంతో రిజిస్ట్రేషన్ ఆధారంగా కొనుగోలు చేసిన వారిలో విశ్వాసం ఏర్పడింది.

### అభివృద్ధి వేగం --- పెరిగిన భూముల విలువ

2000 తర్వాత హైదరాబాద్ విస్తరణ వేగం పెరిగింది. అవుటర్ రింగ్ రోడ్ ప్రణాళికలు, ఐటీ కారిడార్ విస్తరణ వంటి అంశాలు కొల్లూరు ప్రాంతాన్ని పెట్టుబడిదారుల దృష్టిలోకి తెచ్చాయి.

భూముల విలువలు ఒక్కసారిగా పెరగడంతో పాత లావాదేవీలపై ప్రశ్నలు తలెత్తాయి. అప్పటికే పత్రాలు ఉన్న యజమానులు కొత్తగా క్లెయిమ్‌లు రావడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### వివాదాల మధ్య యజమానుల ఆవేదన

చట్టబద్ధ పత్రాలు ఉన్నప్పటికీ, నిర్మాణ అనుమతులు, లావాదేవీలలో ఆలస్యం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని ప్లాట్ యజమానులు చెబుతున్నారు.

"ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసింది. పన్నులు తీసుకుంది. ఇప్పుడు మా హక్కులు ఎందుకు ప్రశ్నార్థకంగా మారాలి?" అని వారు ప్రశ్నిస్తున్నారు.

### లోకాయుక్త పరిశీలన --- కీలక పరిణామం

ఫిర్యాదుల నేపథ్యంలో విషయం లోకాయుక్త దృష్టికి వెళ్లింది. పాత రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలు, లేఅవుట్ పత్రాలు పరిశీలించబడ్డాయి.

విచారణలో చట్టబద్ధంగా జరిగిన లావాదేవీలను నిరాకరించలేమనే అభిప్రాయం వ్యక్తమైనట్లు బాధితులు చెబుతున్నారు. ఇది ప్లాట్ యజమానులకు కొంత ఊరటనిచ్చింది.

### ప్రజల నమ్మకమే ప్రధాన అంశం




రియల్ ఎస్టేట్ వ్యవస్థలో ప్రజలు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ వ్యవస్థపై ఆధారపడుతారు. ఒకసారి చట్టబద్ధంగా నమోదు చేసిన ఆస్తిపై హక్కులు అనిశ్చితంగా మారితే ప్రజల్లో భయం ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

అందువల్ల పత్రాలు ఉన్న యజమానుల హక్కులను స్పష్టంగా గుర్తించడం ద్వారా మాత్రమే ఈ వివాదానికి పరిష్కారం లభిస్తుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### పరిష్కారం కోసం ఎదురుచూపులు

దశాబ్దాలుగా సాగుతున్న కొల్లూరు భూముల వివాదం ఇప్పుడు కీలక దశలో ఉంది. చట్టబద్ధ పత్రాలు కలిగిన యజమానుల హక్కులను అమలు చేస్తేనే సమస్యకు ముగింపు లభిస్తుందని బాధితులు భావిస్తున్నారు.

"మా వద్ద ఉన్న రిజిస్ట్రేషన్ పత్రాలే మా బలం. న్యాయం అమలు కావాలి" --- ఇదే ప్రస్తుతం కొల్లూరు ప్లాట్ యజమానుల ప్రధాన డిమాండ్.

---

# మున్సిపల్ గెలుపు జోష్‌లో కేబినెట్ భేటీ.. బడ్జెట్, రైతు భరోసాపైనే నజర్!

### ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి సమావేశమైన మంత్రిమండలి.. కీలక నిర్ణయాలకు సిద్ధం

**మొదటి పేజీ తరువాయి**



హైదరాబాద్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా ముగిసి, కూటమి (కాంగ్రెస్) ఘనవిజయం సాధించిన నేపథ్యంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సచివాలయంలో భేటీ అయ్యింది. ఎన్నికల ఫలితాల తర్వాత జరుగుతున్న తొలి సమావేశం కావడంతో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మున్సిపల్ విజయంతో వచ్చిన ఊపును కొనసాగిస్తూనే, రాబోయే బడ్జెట్ సమావేశాలు, రైతులకు సంబంధించిన కీలక హామీలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చిస్తున్నారు.

**కేబినెట్ భేటీలో ప్రధాన చర్చాంశాలు:**

బడ్జెట్ సమావేశాల షెడ్యూల్: ఫిబ్రవరి 26 నుంచి ప్రారంభం కానున్నట్లు సమాచారం ఉన్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తేదీలను ఈ భేటీలో ఖరారు చేయనున్నారు. సుమారు 10 నుంచి 15 రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.

**రైతు భరోసా నిధుల విడుదల:** యాసంగి (రబీ) సీజన్‌కు సంబంధించి రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేసే అంశంపై కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది. వచ్చే రెండు రోజుల్లోనే నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసేలా కసరత్తు జరుగుతోంది.

**మున్సిపల్ పాలన – కొత్త లక్ష్యాలు:** ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన నేపథ్యంలో, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించడం, పాలనను ప్రజలకు చేరువ చేయడంపై మంత్రులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు.

**ఆరు గ్యారంటీల అమలు:** మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించేలా ఆర్థిక శాఖ చేసిన ప్రతిపాదనలపై మంత్రిమండలి సుదీర్ఘంగా చర్చించనుంది.

**జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు:** మున్సిపల్ ఎన్నికల జోరులోనే పెండింగ్‌లో ఉన్న స్థానిక సంస్థల (జిల్లా పరిషత్, మండల పరిషత్) ఎన్నికలకు వెళ్లాలా? లేదా అనే అంశంపై కూడా స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**మంత్రులకు అభినందనలు:** మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన మంత్రులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా 'హంగ్' ఏర్పడిన చోట్ల స్వతంత్రుల మద్దతు కూడగట్టి మున్సిపాలిటీలను హస్తగతం చేసుకునే బాధ్యతలను ఇన్-ఛార్జ్ మంత్రులకు అప్పగించినట్లు తెలుస్తోంది

# టీంఇండియా సెమీస్ చేరాలంటే ఇవి తప్పనిసరి!



టీ20 వరల్డ్ కప్ లో ప్రస్తుతం టీమ్ ఇండియా పరిస్థితి చాలా క్లిష్టంగా మారింది. నిన్న న్యూజిలాండ్ చేతిలో భారత్ ఓటమి పాలవడంతో సెమీఫైనల్ అవకాశాలు పూర్తిగా నెట్ రన్ రేట్ (ఎన్ఆర్ఆర్) మీద ఆధారపడే స్థితికి వచ్చాయి. ఇకపై భారత్ ఆడే ప్రతి మ్యాచ్ చాలా కీలకం అయింది. మిగిలిన మ్యాచ్‌లలో ఒక్కటైనా ఓడిపోతే సెమీఫైనల్ ఆశలు దాదాపు ముగిసినట్టే అవుతుంది. అందువల్ల భారత్ తప్పనిసరిగా మిగిలిన అన్ని మ్యాచ్‌లను గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అయితే కేవలం గెలవడం మాత్రమే సరిపోదు. భారీ తేడాతో గెలవడం అత్యంత ముఖ్యమైంది. ప్రస్తుతం భారత్ ఎన్ఆర్ఆర్ తక్కువగా ఉండటంతో, ప్రత్యర్థి జట్టును 40 నుంచి 50 పరుగుల భారీ తేడాతో ఓడించడం లేదా కనీసం 3 నుంచి 5 ఓవర్లు మిగిలి ఉండగానే మ్యాచ్ ముగించడం అవసరం. ఇలా చేస్తేనే భారత్ ఎన్ఆర్ఆర్ వేగంగా పెరిగి ఇతర జట్ల కంటే మెరుగైన స్థానంలో నిలబడగలదు. ఒకవేళ పాయింట్లు సమానంగా ఉన్నా, ఎన్ఆర్ఆర్ తక్కువగా ఉంటే సెమీఫైనల్ అవకాశం కోల్పోయే ప్రమాదం ఉంది.

భారత్ సెమీఫైనల్‌కు చేరుకోవడం కేవలం తమ గెలుపుపై మాత్రమే ఆధారపడదు. గ్రూప్–లా లో ఉన్న ఇతర బలమైన జట్లు కనీసం ఒక మ్యాచ్‌లో ఓడిపోవడం కూడా భారత్‌కు అనుకూలంగా మారుతుంది. ఎందుకంటే మూడు జట్లు సమాన పాయింట్లు సాధిస్తే ఎన్ఆర్ఆర్ ఆధారంగానే టాప్-2 జట్లు సెమీఫైనల్‌కు ఎంపిక అవుతాయి. అందువల్ల భారత్ భారీ విజయాలు సాధించడమే కాకుండా ప్రత్యర్థి జట్ల ఫలితాలు కూడా తమకు అనుకూలంగా రావాలి.

అంటే సింపుల్ గా చెప్పాలంటే భారత్ సెమీస్ చేరేందుకు నాలుగు ముఖ్యమైన అంశాలు కీలక పాత్ర పోషించనున్నాయి. మిగిలిన అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించడం, భారీ మార్జిన్‌తో గెలవడం ద్వారా నెట్ రన్ రేట్ పెంచుకోవడం, ప్రత్యర్థి ప్రధాన జట్టు కనీసం ఒక మ్యాచ్ ఓడిపోవడం, పాయింట్స్ టేబుల్‌లో కనీసం టాప్-2 స్థానాల్లో నిలవడం. ఈ సమీకరణాలు అన్నీ సరిగ్గా కుదిరితేనే భారత్ సెమీఫైనల్‌కు చేరే అవకాశం ఉంటుంది.


ఇక ఒకసారి సెమీఫైనల్‌కు చేరిన తర్వాత ఎన్ఆర్ఆర్ గాని పాయింట్స్‌కు గాని సంబంధం ఉండదు. సెమీఫైనల్ మ్యాచ్‌లో ఎవరు గెలిస్తే వారు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటారు. అదే విధంగా ఫైనల్ మ్యాచ్ గెలిస్తే వరల్డ్ కప్ టైటిల్ భారత్ సొంతమవుతుంది. కానీ ప్రస్తుత సూపర్ -8 దశ మాత్రం భారత్‌కు ఇది పూర్తిగా Win Big or Exit పరిస్థితిగా మారింది.

# బుమ్రా నయా హిస్టరీ.. టీ20 వరల్డ్‌కప్ చరిత్రలో టాప్ వికెట్ టేకర్‌గా యార్కర్ కింగ్

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా టీమిండియా జం సౌతాఫ్రికా పోరు కొనసాగుతోంది. దక్షిణాఫ్రికాతో జరిగిన ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ 2026 సూపర్ 8 మ్యాచ్‌లో భారత స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా మరో చరిత్ర సృష్టించాడు. బుమ్రా బౌలింగ్ గురించి పెద్దగా చెప్పనవసరం లేదు. ఈ మ్యాచ్‌లోనూ సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్స్‌ను కట్టడి చేశాడు. మూడు వికెట్లు పడగొట్టి (3/15) అద్భుత గణాంకాలతో మెరిశాడు. టీ20 వరల్డ్‌కప్‌ల చరిత్రలో భారత్ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. ఇప్పటివరకు 22 ఇన్నింగ్స్‌లలో 33 వికెట్లు సాధించి రవిచంద్రన్ అశ్విన్ (32) రికార్డును అధిగమించాడు. అర్ష్‌దీప్ సింగ్ సైతం 18 ఇన్నింగ్స్‌లలో 32 వికెట్లు తీసి అశ్విన్‌తో సమానంగా ఉన్నాడు. హార్దిక్ పాండ్యా 29, రవీంద్ర జడేజా 22 వికెట్లతో తరువాతి స్థానాల్లో ఉన్నారు.

ఈ మ్యాచ్‌లో బుమ్రా క్వింటన్ డికాక్, రియన్ రికెల్టన్, కార్బిన్ బోష్ వికెట్లు తీసి దక్షిణాఫ్రికా దూకుడుకు బ్రేక్ వేశాడు. అయినప్పటికీ.. సఫారీ జట్టు 7 వికెట్ల నష్టానికి 187 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. నరేంద్ర మోడీ లాంటి పెద్ద స్టేడియంలో ఇంత పెద్ద స్కోర్ సాధించడం టీమిండియాకు కష్టంగా మారుతోంది. అయితే.. సౌతాఫ్రికా ఆరంభంలోనే 20 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ సమయంలోనే అయితే డేవిడ్ మిల్లర్ (35 బంతుల్లో 63; 7 ఫోర్లు, 3 సిక్సర్లు), డేవాల్డ్ బ్రెవిస్ (29 బంతుల్లో 45; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) సూపర్ ఇన్నింగ్స్ ఆడారు. ఇద్దరు 51 బంతుల్లో 97 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో ఈజీగా 200 క్రాస్ అవుతుందని అందరూ భావించారు. కానీ చివరి ఓవర్లలో బుమ్రా (3/15), అర్ష్‌దీప్ సింగ్ (2/28) అద్భుతంగా బౌలింగ్ చేసి మ్యాచ్‌పై భారత్ పట్టు సాధించింది. చివరి నాలుగు ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా స్కోరు కొంత తగ్గింది. అయినప్పటికీ ట్రిస్టన్ స్టబ్స్ (24 బంతుల్లో 44 నాటౌట్) చివరి ఓవర్‌లో హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో వరుస సిక్సర్లు బాది జట్టుకు బలమైన ముగింపు ఇచ్చాడు.







# కడప పోలీస్ శాఖలో ఏసీబీ 'మెరుపు' దాడి..

## లంచం తీసుకుంటూ దొరికిపోయిన సీఐ, ఎస్సై!

- సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో కలకలం..
- రూ. 1.50 లక్షలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన అధికారులు




కడప(BNS): జిల్లాలోని పోలీస్ శాఖలో అవినీతి తిమింగలాలు ఏసీబీ వలలో చిక్కడం తీవ్ర కలకలం రేపుతోంది. సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం జరిపిన మెరుపు దాడిలో రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్సై అనిల్ కుమార్ భారీ మొత్తంలో లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయారు. సుమారు మూడు గంటలుగా వీరిద్దరినీ స్టేషన్‌లోనే ఉంచి ఏసీబీ అధికారులు సుదీర్ఘంగా విచారిస్తున్నారు.

**అసలేం జరిగింది? :**

ఈ కేసుకు సంబంధించి దిగ్భ్రాంతికరమైన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. కాశ్మీర్‌లో చోరీకి గురైన ఒక ద్విచక్ర వాహనాన్ని అక్రమార్కులు ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చి, నెంబర్ ప్లేట్ మార్చి విక్రయించారు. ఆ వాహనం ద్వారా సుమారు రూ. 15 లక్షల విలువైన చైన్ స్నాచింగ్ దొంగతనాలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో సదరు ద్విచక్ర వాహనాన్ని అమ్మిన కదిరికి చెందిన ఏజెంట్ బ్రహ్మంను పోలీసులు టార్గెట్ చేశారు.

**వేధింపులు – లంచం డిమాండ్:**

ఈ కేసు నుంచి బయటపడాలంటే రూ. 4 లక్షలు ఇవ్వాలని సీఐ, ఎస్సైలు బ్రహ్మంను డిమాండ్ చేశారు. భయపడిన బాధితుడు గత శనివారం ఇప్పటికే లక్ష రూపాయలను లంచంగా అందజేశారు. అయితే, మిగిలిన డబ్బు కోసం పోలీసులు తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో తట్టుకోలేక బ్రహ్మం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.

**రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు:**

బాధితుడి ఫిర్యాదుతో పథకం రచించిన ఏసీబీ అధికారులు, సోమవారం సాయంత్రం లక్షన్నర రూపాయల (1.50 లక్షలు) నగదును బ్రహ్మం ద్వారా అందజేస్తుండగా దాడి చేశారు. నగదును సీజ్ చేసిన అధికారులు, సీఐ వెంకటరమణ మరియు ఎస్సై అనిల్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు.

**ఉన్నతాధికారుల హస్తం ఉందా?:**

విచారణలో ఎస్సై అనిల్ కుమార్ సంచలన స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు సమాచారం. డీఎస్పీ మరియు రూరల్ సీఐ ఆదేశాల మేరకే తాను బ్రహ్మం నుంచి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆయన ఏసీబీ అధికారులకు వెల్లడించినట్లు తెలుస్తోంది. దీనితో ఈ అవినీతి నెట్‌వర్క్ ఎంతవరకు విస్తరించి ఉందనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు.

# ఆర్థిక సహాయం చేసిన మాజీ కార్పొరేటర్




శంషిగూడ డివిజన్ పరిధిలోని శంషిగూడకు చెందిన నిరుడు శ్రీనివాస్(58) అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం తో. విషయం తెలుసుకున్న డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్థివ దేహానికి పూలమాల వేసి అంతిమ నివాళులు అర్పించడం జరిగింది. గోపాల్, జోగిపేట్ భాస్కర్, పోశెట్టిగౌడ్, లింగం, సుధాకర్, సత్తయ్య, శ్యామ్, నరసింహ తదితరులు ఉన్నారు.

# శిశు మందిరాల పునర్వైభవం కోసం పూనుకున్న పూర్వ విద్యార్థులు



ఉమ్మడి పాలమూరు కేంద్రంగా, బృందావన్ గార్డెన్స్ లో జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఉమ్మడి పాలమూరు లో గల 28 పాఠశాలల పూర్వ విద్యార్థులు మరియు పూర్వ, ప్రస్తుత ఆచార్యులు, ప్రబంధకారిణీ సభ్యులు, హితైషులు పాల్గొనడం జరిగింది.

ఈ కార్యక్రమంలో సుమారుగా 3000 పైచిలుకు పూర్వ విద్యార్థులు, 250 సంఖ్యలో పూర్వ ఆచార్యులు పాల్గొనడం విశేషం. ఈ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులను ఉద్దేశించి ముఖ్య వక్తగా విచ్చేసిన విద్యా భారతి, దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి అయాచితుల లక్ష్మణరావు, దక్షిణ మధ్య క్షేత్ర పూర్వ విద్యార్థి పరిషత్ అధ్యక్షులు రెడ్డిగారి హరిస్మరణ్ రెడ్డి, పూర్వ విద్యార్థి పరిషత్ దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి చొల్లేటి రాజారెడ్డి, విభాగ్ కార్యదర్శి కుంటి ఎల్లప్ప మార్గ నిర్దేశనం చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాలమూరు విభాగ్ సంయోజక్, కల్వకుర్తి పాఠశాల పూర్వ విద్యార్థి యద్మ మాధవ రెడ్డి కల్వకుర్తి పాఠశాల నూతన భవన నిర్మాణం కోసం 25 లక్షల సహకారాన్ని ప్రకటించడం జరిగింది. పెద్దమందడి పాఠశాల కోసం సొంత భవనం నిర్మించుకోవడానికి డిప్యూటీ తహసీల్దారు అశోక్ 25 లక్షల విలువైన అర ఎకరం స్థలాన్ని పాఠశాలకు సహకారంగా ప్రకటించడం జరిగింది.

వనపర్తి శిశుమందిర్ పాఠశాలను సీబీఎస్సీ పాఠశాలగా నిర్వహించుటకు అక్కడ పూర్వ విద్యార్థులు కోటి రూపాయల సహకారాన్ని ప్రకటించారు. అంతేకాకుండా అచ్చంపేట పాఠశాల తో పాటు పాలమూరులో ఉన్న ప్రతీ జిల్లా కేంద్రాలలో సీబీఎస్సీ పాఠశాలలను నిర్మించాలని పూర్వ విద్యార్థులంతా సమ్మేళనం సందర్భంగా సంకల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీ డి.కే అరుణ గద్వాల పాఠశాల భవన నిర్మాణం కోసం ఐదు ఎకరాల స్థలాన్ని గద్వాల పట్టణంలో ఏర్పాటు చేయుటకు సహకరిస్తానని సభాముఖంగా ప్రకటించడం విశేషం. ఈ కార్యక్రమానికి ఆహ్వానించడానికి వెళ్ళినప్పుడు శిశుమందిర్ పూర్వ విద్యార్థి, తెలంగాణ క్యాబినెట్ మంత్రి వాకిటి శ్రీహరి ఉమ్మడి పాలమూరులో ఆవాసం పాఠశాల నిర్మించడానికి స్థలం కేటాయించే విషయంలో సహకరిస్తామని మాట ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమానికి మూతబడిన పాఠశాలల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు, వారి పాఠశాలలను పునః ప్రారంభించుకోవాలని

ప్రతినబూనారు. ఈ సమ్మేళనం సందర్భంగా, కంటి ఆసుపత్రి డాక్టర్ విజయ్ రెడ్డి సీబీఎస్సీ పాఠశాల నిర్మాణం కోసం 50 లక్షల ఆర్థిక సహకారాన్ని అందిస్తామని ప్రకటించడం జరిగింది. డాక్టర్ శ్రీనివాసరావు వారి మిత్రబృందమైన డాక్టర్లచే శిశు మందిరాల పునర్వైభవ స్థితికి అన్ని విధాల సహకరిస్తామని ప్రకటించారు.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జన్మ శతాబ్ది సందర్భంగా ఉమ్మడి పాలమూరు శిశుమందిర్ పాఠశాలల పూర్వ విద్యార్థులచే

నిర్వహించబడిన ఈ సమ్మేళనానికి పాలమూరు విభాగ్ అధ్యక్షులు ఓబుగారి శ్రీనివాసయ్య, ఉపాధ్యక్షులుమద్ది అనంతరెడ్డి, శిబిర వ్యవస్థ ప్రముఖ్ అశోక్ రెడ్డి, పూర్వవిద్యార్థి పరిషత్ విభాగ్ సహసంయోజక్ నేపాల్ రెడ్డి, పూర్వవిద్యార్థి పరిషత్ కోశాధికారి మల్లిఖార్జున మొదటి నుండీ వెన్నుదన్నుగా ఉంటూ సహాయ సహకారాలు అందించడంతోపాటు శిశు మందిరాల పునర్వైభవ సాకారం కోసం వారి సహకారం ఎప్పుడూ ఉంటుందని ప్రకటించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో, ప్రముఖులు బండారి శాంతకుమార్, తెలంగాణ ప్రాంత పూర్వ విద్యార్థి పరిషత్ బాధ్యులు బొడ్డు శ్రీనివాస్, పాలమూరు విభాగ్ ప్రభారి సాకేతన్ రెడ్డి , శిబిర ప్రముఖ్ శ్రీరాంరెడ్డి , సహ ప్రముఖ్ యుగెందర్ రెడ్డి , పరిషత్ కార్యకారిణి సభ్యులు రజినీకాంత్, పూర్వాచార్య ప్రభారి కండే సాయి శంకర్, పుర ప్రముఖులు, హితైషులు పాల్గొని ఈ పాలమూర్ శిశుమందిర్ పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# సోషల్ మీడియా పై అసెంబ్లీలో చర్చ

**⇨ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న చట్టాలను పరిశీలిస్తున్నాం**

**⇨20 నెలల్లో 1384 కేసులు నమోదు.. హోం మంత్రి.**



అమరావతి, ఫిబ్రవరి 23:-సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాల నియంత్రణపై అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష అడిగిన ప్రశ్నకు హోంమంత్రి అనిత సమాధానం ఇచ్చారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాల కట్టడికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు ఉపసంఘం రెండుసార్లు సమావేశమై వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు. తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న చర్యలను సమీక్షించినట్లు చెప్పారు. మన రాష్ట్రంలో ఎలాంటి చర్యలు తీసుకుంటే సమర్థవంతంగా ఉంటాయన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

విద్వేషపూరిత, అసభ్య పోస్టుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ఇప్పటివరకు సోషల్ మీడియా పోస్టులపై 1,384 కేసులు నమోదు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో 1,067 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

తప్పుడు ప్రచారాల కట్టడికి కొత్త చట్టం తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అలాగే పాఠశాల విద్యార్థులు సోషల్ మీడియా వినియోగించకుండా చట్టం తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నట్లు హోంమంత్రి అనిత తెలిపారు.

# అంగన్వాడీలకు కనీసవేతనం అమలుచేయాలి

## మైదుకూరు ప్రాజెక్ట్ కార్యాలయం ముందు రిలేదీక్షలు ప్రారంభం



అంగన్వాడీలకి కనీసవేతనం 26,000 అమలుచేయాలని, గ్రాడ్యూటీ అమలుకు గైడ్స్ లెన్స్ రూపొందించాలని. మిగిలిపోయిన 1810 మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా ప్రమోట్ చేయాలనీ. ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుచు రాష్ట్రవ్యాప్తంగ అంగన్వాడీ వర్కర్స్ ఽహెల్పర్స్ యూనియన్(జ×ుఖ) అనుబంధం ఆధ్వర్యంలో 23,24,తేదీలలో ప్రాజెక్ట్ కార్యాలయాలముందు తలపెట్టిన రిలేదీక్షలలో భాగంగా మైదుకూరు×జణూ ప్రాజెక్ట్ ముందు ప్రారంబించారు, ఇసందర్భంగా యూనియన్ నాయకురాళ్లు ధనలక్ష్మి, భారతి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వేతనాల కోసం ఆ0దోళనలు నిర్వహిస్తే మద్దతు తెలిపి భరోసా ఇచ్చిన టీడీపీ, జనసేన, నాయకులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్వాడీల సమస్యలు పట్టించుకోకపోవటం అన్యాయం అని వారన్నారు. అధికారంలో ఉంటే ఒకలా లేకుంటే మరోలా వ్యవహరించటం ప్రభుత్వానికి తగదని వారు హితవు పలికారు.రెండు రోజుల పాటు ప్రాజెక్టు కార్యాలయాల ముందు 25,26 తేదీలలో కలెక్టర్ కార్యాలయల ముందు దీక్షలను నిర్వహిస్తామని సమస్యలు పరిష్కరించకపోతే చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని వారు తెలిపారు,ఈ దీక్షలలో రామతులసి, రమాదేవి వరలక్ష్మి, శకుంతల, లత, మస్తానమ్మ, సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి

## కాంగ్రెస్ పార్టీ కట్టుబడి వుంది.

**-ముప్పై ఏళ్ల కల నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీ పాలకమండలి.**

**-హర్షం వ్యక్తం చేసిన స్థానిక ప్రజలు.**

మున్సిపల్ ఎన్నికలలో,ప్రజలకు ఇచ్చిన హామిలు అమలు చేస్తామని, సూర్యాపేట సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని,ఎ ఐ సి సి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్షాది లు అన్నారు. సూర్యాపేట 34 వ వార్డు హ్యాబర్ట్ నగర్, 60 ఫీట్ల రోడ్ ను కలిపే కల్వర్ట్, నిర్మాణానికి ప్రతిభ కాలేజ్ పక్క సందులో సోమవారం నాడు, మున్సిపల్ చైర్చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్షాది శంకుస్థాపన చేశారు. అలాగే ఆక్స్ ఫర్డ్ స్కూల్ నుండి డి మార్ట్ రోడ్ ను కలిపే, కల్వర్టు నిర్మాణానికి కూడ శంకుస్థాపన చేశారు. ఈ రెండు కల్వర్టులు గత ముప్పై సంవత్సరాల నుండి నిర్మాణం జరగకుండా పెండింగ్ లో వుండగా, తాను మున్సిపల్ చైర్మన్ గా గెలిచిన వెంటనే మొదటి శంకుస్థాపన కార్యక్రమంగా, మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్షాది చేపట్టడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముప్పై సంవత్సరాల నుండి తాము కల్వర్ట్ నిర్మాణానికి ప్రయత్నం చేస్తున్న ఇప్పటికి, ఈ రోజున తమ కల నేరవేరిందని వారు అన్నారు.అనంతరం వాసవి మాత ఆలయం వెనక రోడ్డు కు, స్థానిక 37 వ వార్డులో సి సి రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్ లు నాగుల వాసు, బైరు శైలేందర్, పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, మాజి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, బైరు వెంకన్న, దంతాల వీరయ్య, ఆలేటి మాణిక్యం, నేరెళ్ల మధు, రాచకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో వికారాబాద్ పోలీసుల ప్రభంజనం,

## విజేతలను అభినందించిన ఎస్పీ స్నేహ మెహ్రా

ఇటీవల సైబరాబాద్ వేదికగా నిర్వహించిన '4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్ ఽ స్పోర్ట్స్ మీట్-2026' లో చార్మినార్ జోన్ తరపున పాల్గొని, అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన జిల్లా పోలీస్ అధికారులను మరియు సిబ్బందిని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపిఎస్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ క్రీడా పోటీల్లో వికారాబాద్ జిల్లాకు చెందిన క్రీడాకారులు వివిధ క్రీడా విభాగాల్లో పాల్గొని మొత్తం 15 పతకాలను (1 గోల్డ్, 7 సిల్వర్, 7 బ్రాంజ్) సాధించి జిల్లా ప్రతిష్టను రాష్ట్ర స్థాయిలో చాటారు.




ముఖ్యంగా, అథ్లెటిక్స్ విభాగంలో కె. స్వాతి హైజంప్‌లో బంగారు పతకం సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. వెండి పతకాలు సాధించిన వారిలో బాడ్మింటన్ డబుల్స్‌లోసఎతీఎ సిఐపి నవీన్ కుమార్, వెయిట్ లిఫ్టింగ్ (60ఖస్త్ర)లో కె. స్వాతి, ఆర్మ్ రెస్లింగ్ (100ఖస్త్ర)లో బి. నర్సింహులు, ఆర్మ్ రెస్లింగ్ (85ఖస్త్ర)లో మహేందర్, ఆర్మ్ రెస్లింగ్ (60ఖస్త్ర) మరియు టేక్వాండో (60ఖస్త్ర) విభాగాల్లో శ్రీనివాస్, బాక్సింగ్ (65ఖస్త్ర)లో రెహమతుల్లాలు ఉన్నారు. అలాగే, కాంస్య పతక విజేతలలో ఆర్మ్ రెస్లింగ్ (65ఖస్త్ర)లో బి. కావ్య, ఆర్మ్ రెస్లింగ్ (55ఖస్త్ర)లో స్వాతి, వాటర్ స్పోర్ట్స్ (కనోయింగ్ 200 మీటర్లు)లో మన్సూర్, స్విమ్మింగ్ (100 మీటర్లు)లో రవీందర్, హ్యామర్ త్రోలో జై ఆనంద్, బాక్సింగ్ (70ఖస్త్ర)లో ప్రకాష్ మరియు మహిళల ఖో-ఖో జట్టు (3వ స్థానం) నిలిచారు.


ఈ సందర్భంగా విజేతలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ "నిరంతరం శాంతిభద్రతల పరిరక్షణలో బిజీగా ఉంటూ, విధి నిర్వహణలో ఎంతో ఒత్తిడి ఎదుర్కొంటున్నప్పటికీ, క్రీడల పట్ల మక్కువతో సమయం కేటాయించి పతకాలు సాధించడం నిజంగా గర్వకారణం. ఒక పోలీస్ అధికారికి వృత్తిపరమైన నైపుణ్యంతో పాటు శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం చాలా ముఖ్యం. క్రీడలు ఈ రెండింటిని పెంపొందించడమే కాకుండా మనలో టీమ్ వర్క్ (జట్టు స్ఫూర్తి) మరియు క్రమశిక్షణను నింపుతాయి. గెలుపోటముల కంటే క్రీడల్లో పాల్గొనడం, మన ప్రతిభను నిరూపించుకోవడం ముఖ్యం. ఈ గెలుపు కేవలం మీకు మాత్రమే కాదు, చార్మినార్ జోన్ మరియు వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ మొత్తానికి గర్వకారణం" అని, మీరు సాధించిన ఈ పతకాలు తోటి సిబ్బందికి పెద్ద స్ఫూర్తినిస్తాయి. భవిష్యత్తులో కూడా క్రీడాకారులకు జిల్లా పోలీస్ శాఖ తరపున పూర్తి సహకారం ఉంటుందని, జాతీయ స్థాయిలో కూడా మన జిల్లా పేరు మారుమోగేలా మీరు కృషి చేయాలని" ఆకాంక్షించారు.

ఈ అభినందన కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ ఆర్. ఐ డేవిడ్ విజయ్ కుమార్,డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్ లు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

# కలువాయిలో "భూ మాయాజాలం"

**● వైసీపీ హయాంలో వెయ్యి ఎకరాల రికార్డులు గల్లంతు?**

**●సీఐడీ దర్యాప్తు చేయాలి: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ డిమాండ్**



నెల్లూరు జిల్లా కలువాయి(బి.యన్.యస్):- వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి మండలంలో వైసీపీ హయాంలో జరిగిన భూకుంభకోణం గురించి వెల్లువెత్తుతున్న ఆరోపణలు అసెంబ్లీని కుదిపేసింది. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గారు కలువాయిలో జరిగిన భూ కుంభకోణాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూముల రికార్డులు ట్యాంపరింగ్‌కు గురయ్యాయని ఆయన అసెంబ్లీ లో సంచలన ఆరోపణలు చేశారు.

కలువాయి వైసీపీ జడ్పీటీసి అనిల్ కుమార్ రెడ్డి కోట్ల రూపాయల లంచాలు తీసుకుని రికార్డుల్లో మార్పులు చేశారని, తహసీల్దార్ స్థాయిలోనే అక్రమాలు జరిగాయని తెలిపారు. చనిపోయిన వారి పేర్లపై డీ-ఫామ్ పట్టాలు సృష్టించడం, అసైన్‌మెంట్ కమిటీ అనుమతి లేకుండానే పట్టాలు జారీ చేయడం వంటి అంశాలు వెలుగుచూస్తున్నాయని చెప్పారు.

ఎస్సీల భూములు ఓసీల పేర్లకు బదిలీ చేయడం, అసైన్డ్ భూములను ఒరిజినల్ పట్టాలుగా మార్చడం వంటి తీవ్ర అక్రమాలు జరిగాయని మండిపడ్డారు. మేత, కాలువ పోరంబోకు భూములు కూడా మినహాయింపు కాలేదన్నారు.అదేవిధంగా

నాయబ్రాహ్మణి కాలనీలో లేఅవుట్లు వేసి పేదల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి దొంగ పట్టాలు విక్రయించారని ఆరోపించారు. ఈ భూవివాదాల కారణంగా హత్యాయత్నాలు జరిగి కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు.

రెవెన్యూ రికార్డుల గందరగోళం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సీఐడీ దర్యాప్తు ద్వారా అసలు నిజాలు వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు. ట్యాంపరింగ్‌కు గురైన రికార్డులను ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సరిదిద్దాలని ప్రభుత్వాన్ని కోరారు.

# కర్ల రాజేష్ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు

## చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.

**-కర్ల రాజేష్ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు.**

**-జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



స్వయంగా నివాసానికి వెళ్లి, ఇంటి మంజూరి ఉత్తర్వులను అందించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.ఇటీవల మరణించిన కర్ల రాజేష్ కుటుంబానికి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వుల కాపీని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోదాడలో, కర్ల రాజేష్ ఇంటికి వెళ్లి రాజేష్ తల్లి కర్ల లలితకు స్వయంగా అందించారు. ఈ సందర్భంగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటిని రెండు, మూడు నెలల్లో పూర్తి చేసి అందించాలని సంబంధిత హౌసింగ్ ఏఇ ని ఆదేశించారు. పనుల్లో జాప్యం చేయొద్దని సూచించారు.

ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డిఓ సూర్యనారాయణ, హౌసింగ్ ఏఈ జెఎస్ఎన్ మూర్తి, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద రాణి, తహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.



# సినిమా న్యూస్



## ఇమాన్వికి బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చిన ప్రభాస్



ప్రభాస్ అంటే కేవలం కటౌట్ మాత్రమే కాదు, ఆయనది చాలా పెద్ద మనసు అని ఇండస్ట్రీలో అందరూ చెబుతుంటారు. షూటింగ్ సెట్స్‌లో తోటి నటీనటులకు తన ఇంటి నుంచి రకరకాల వంటకాలు పంపించి విందు ఇవ్వడం ప్రభాస్‌కు అలవాటు. ఇప్పుడు అదే మ్యాజిక్ తన కొత్త సినిమా 'ఫౌజీ' హీరోయిన్ ఇమాన్వి విషయంలోనూ రిపీట్ అయ్యింది. ప్రభాస్ పంపిన ఫుడ్ చూసి ఈ భామ తెగ మురిసిపోతోంది. ప్రభాస్ తన కోసం పంపిన స్పెషల్ ఫుడ్ ఐటమ్స్‌ను ఇమాన్వి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేసింది. డార్లింగ్ చూపించిన ఈ ప్రేమకు, పంపిన రుచికరమైన భోజనానికి ఆమె ఎంతో సంతోషపడిపోతూ, తన ఆనందాన్ని తట్టుకోలేక ప్రభాస్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపింది. ఈ ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్లు డార్లింగ్ ఈజ్ బ్యాక్.. ఆతిథ్యంలో ఆయనకు ఎవరూ సాటి రారు అంటూ కామెంట్స్ చేస్తున్నారు.కాగా.. ప్రస్తుతం ప్రభాస్, ఇమాన్వి జంటగా పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న చిత్రం 'ఫౌజీ'. టాలెంటెడ్ డైరెక్టర్ హను రాఘవపూడి ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పూజా కార్యక్రమాల ఫోటోల్లో ఈ జంట చూడముచ్చటగా ఉండటంతో, వీరిద్దరి కెమిస్ట్రీ వెండితెరపై ఎలా ఉండబోతోందో అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ట్రోలర్స్‌కు స్ట్రాంగ్‌గా ఇచ్చిపడేసిన సమంత




టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత చాలా రోజుల తర్వాత యాక్షన్ డ్రామా 'మా ఇంటి బంగారం' సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం సమ్మర్ స్పెషల్‌గా మే 15న థియేటర్స్‌లోకి రాబోతుంది. సామ్ ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటోంది. ఈ క్రమంలో.. తాజాగా, సమంత తన ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో ముచ్చటిస్తూ.. తన వ్యక్తిగత జీవితం, ఆరోగ్య సోషల్ మీడియాలో వచ్చే విమర్శలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. నెగటివ్ కామెంట్లను ఎలా ఎదుర్కొంటారని ఒక అభిమాని అడిగిన ప్రశ్నకు సమంత స్పందిస్తూ.. "ప్రశంసలు నన్ను పొంగిపోయేలా చేయవు, అలాగని ట్రోల్స్ నన్ను కుంగదీయవు. కానీ నా డిజిటల్ స్పేస్‌లోకి ఎవరైనా నెగిటివిటీని తీసుకొస్తే మాత్రం బాగోదు వారిని వెంటనే బ్లాక్ చేస్తాను.

నా ఇంటిని నేను ఎలాగైతే శుభ్రంగా ఉంచుకుంటానో, నా సోషల్ మీడియా పేజీని కూడా అలాగే ఉంచుకుంటాను. నేను మిమ్మల్ని బ్లాక్ చేశానంటే మీరు నన్ను బాధపెట్టారని కాదు, నా ప్రపంచంలోకి మీకు ప్రవేశం లేదని అర్థం" అని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చూస్తూ సమయం వృథా చేయడం గురించి స్పందిస్తూ.. ఇది తనను కూడా భయపెడుతోందని ఆమె అంగీకరించారు. చిన్నప్పుడు చదువుకోవడానికి ఒక టైమ్‌టేబుల్ ఉండేదని, ఇప్పుడు ఆ ఏకాగ్రతను కోల్పోతున్నామేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. రీల్స్ సృష్టించే 'ఫోమో' నుండి బయటపడటానికి తాను పుస్తకాలు చదవడం, పాడ్‌కాస్ట్‌లు వినడం మరియు సోషల్ మీడియాకు దూరంగా ఉండటం వంటి నియమాలను పాటిస్తున్నట్లు తెలిపారు. అయితే ఓ నెటిజన్ ఓ ఫన్నీ థింగ్ చెప్పమని అడగ్గా.. కిందపడి మరి నవ్వుతానంది.

ఎక్కువ బాధ లేదా ఒత్తిడికి గురైనప్పుడు ఏం చేస్తారని అనడంతో ధ్యానం చేస్తానని చెప్పింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా.. సమంత సినిమాల విషయానికొస్తే.. 'ఓ బేబీ' వంటి హిట్ తర్వాత నందినీ రెడ్డి దర్శకత్వంలో సమంత చేస్తున్న 'మా ఇంటి బంగారం' మూవీ కోసం సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. రాజ్ నిడిమోరు, సమంత, హిమాంక్ దువ్వూరు దీనిని ట్రాలాలా పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో పాటుగా సామ్ రాజ్, డీకే దర్శకత్వంలో 'రక్త బ్రహ్మాండం: ది బ్లడీ కింగ్‌డమ్' అనే వెబ్ సిరీస్‌లో కూడా నటిస్తున్నట్లు సమాచారం. మొత్తానికి సెకండ్ ఇన్నింగ్స్ సామ్ మళ్లీ బిజీ అయిపోతుంది.

పూనకాలు తెప్పిస్తున్న

## 'ఆయా షేర్' సాంగ్ ప్రోమో




టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ అంటేనే ప్రేక్షకుల్లో ఒక ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'దసరా' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయి ప్రభంజనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు అదే మ్యాజిక్‌ను రిపీట్ చేయడానికి, అంతకు మించిన పవర్ ప్యాక్డ్ యాక్షన్‌తో 'ది ప్యారడైజ్' అనే సినిమాతో మన ముందుకు వస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత సుధాకర్ చెరుకూరి అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ సింగిల్ ప్రోమో విడుదలై సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. 'ఆయా షేర్' అనే పేరుతో వచ్చిన ఈ సాంగ్ ప్రోమోలో నాని కనిపించిన తీరు అభిమానులకు పూనకాలు తెప్పిస్తోంది.

గడ్డం, జుట్టు పెంచి రెండు జడలతో పక్కా మాస్ లుక్‌లో నానిని చూస్తుంటే, శ్రీకాంత్ ఓదెల మరోసారి థియేటర్లలో రచ్చ చేయడం ఖాయమనిపిస్తోంది. ముఖ్యంగా నాని బాడీ లాంగ్వేజ్ ,స్క్రీన్ ప్రెజెన్స్ ఈ సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ అందించిన మ్యూజిక్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ప్రోమోలో వినిపించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వింటుంటేనే గూస్ బంప్స్ వస్తున్నాయని నెటిజన్లు అంటున్నారు. అయితే ఈ పూర్తి పాట ఫిబ్రవరి 24న విడుదల కాబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించడంతో అంతా ఫుల్ ఖుషీ అవుతున్నారు. అనిరుధ్-నాని కాంబోలో వచ్చే పాటలు ఎప్పుడూ చార్ట్ బస్టర్స్ అవుతాయి.. ఇప్పుడు ఈ 'ఆయా షేర్' సాంగ్ కూడా అదే బాటలో సాగబోతోంది. కాగా.. ఈ సినిమాలో నాని సరసన అందాల భామ కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న 'ది ప్యారడైజ్', ఆగస్టు 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతోంది.

## నేను చీప్ కాపీ అయితే.. కంగనా?

సినీ పరిశ్రమ వంటి కాంపిటేటివ్ ఫీల్డ్‌లో కథానాయికలు కలిసి స్నేహంగా మసలడం అరుదైన విషయమే. పైకి అంతా నవ్వుతూ కనిపించినా నివురుగప్పిన నిప్పులా అంతర్గత విభేదాలు ఉంటూనే ఉంటాయి. కంగనా రనౌత్, తాప్సీ మధ్య విభేదాలు తలెత్తాయంటూ గతంలో వార్తలొచ్చాయి. తాజాగా ఈ వ్యవహారంపైనే తాప్సీ స్పందించింది.

'నా వరకూ నేను ఎప్పుడూ ఎవరితో గొడవ పడలేదు. ముఖ్యంగా కంగనాపై వ్యతిరేకంగా ఒక్కమాట కూడా మాట్లాడలేదు. కానీ ఆమె సోదరి నాపై అనుచిత వ్యాఖ్యలు చేసింది. నన్ను 'చీప్ కాపీ' అంటూ సంభోదించింది. నేను ప్రేరణగా తీసుకునే నటీమణుల్లో కంగనారనౌత్ ఒకరు. నేనింకా కంగనా గొప్ప నటి అనుకుంటున్నా. నేను చీప్ కాపీ అయితే.. కంగనా ఏమవుతారు?' అంటూ తెలివిగా కౌంటరిచ్చింది తాప్సీ.

